క్లుప్తంగా

బాట ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: మండలపరిధిలోని చెరుకుచెర్ల బాట సమీపంలో వెలసిన శ్రీ బాట ఆంజనేయ స్వామికి కార్తీకమాసం చివరి శనివారం పీరుసాహెబ్ పేట గ్రామస్తుల ఆధ్వర్యంలో అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, ఆకుపూజ తదితర విశేషపూజలను పురోహితులు శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

పాములపాడు: 18 సంవత్సరాల్లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ గోపీకృష్ణ హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ వ్యాపారాలు, ఇతర ఏ పనుల్లో ఎక్కడైనా సరే బడి ఈడు పిల్లలచే పనులు చేయిస్తే వారిని ఉపేక్షించేది లేదన్నారు. నిబంధనలు అతిక్రమించిన యజమానికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.50వేలు జరిమానా విధించబడునని హెచ్చరించారు. బడి ఈడు పిల్లలను బడిలోనే ఉంచి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని సూచించారు.

ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా సురేష్‌బాబు

నందికొట్కూరు రూరల్: మండలంలోని బ్రాహ్మణకొట్కూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జ్ ఎస్ఐగా సురేష్‌బాబును ఉన్నతాధికారులు నియమించినట్లు హెడ్ కానిస్టేబుల్ నూర్‌అహమ్మద్ శనివారం తెలిపారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ ఓబులేసు బదిలీపై ఆలూరుకు వెళ్లిపోవడంతో ఆయన స్థానంలో ప్రస్తుతం సురేష్‌బాబు బాధ్యతలు తీసుకున్నారన్నారు.

నమోదు ప్రక్రియ త్వరగా పూర్తి చేయండి

కొత్తపల్లి: మండలంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు పెండింగ్‌లో ఉన్న నమోదు ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీఓ మేరీ శనివారం తెలిపారు.గ్రామాలలోని గ్రామ వలంటీర్లు వారి కేటాయించిన కుటుంబాలలో ఎవరైన రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలకు రిజిస్ట్రేషన్ చేసుకోని వారుంటే గుర్తించి త్వరగా పూర్తిచేయించాలన్నారు. ఈ నెల 15 నుంచి గ్రామాలలో ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు నిర్వహిస్తామని, వీలైనంత ఎక్కువమంది క్రీడాకారులను రిజిస్ట్రేషన్ చేయించుకునేలా గ్రామవలంటీర్లు పనిచేయాలన్నారు.

గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలి

ఆత్మకూరు: డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో గ్యాస్ వినియోగదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని గౌరీశంకర్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు గంగాధర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్యాస్ ఉన్న ప్రతి వినియోగదారుడు ఈ-కేవైసీ ద్వారా ధ్రువీకరించుకోవాలని, ఆ తర్వాతే గ్యాస్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. గ్యాస్ ఏజెన్సీ వద్ద లేదా గ్యాస్ డెలివరీ చేసే బాయ్స్ వద్దనైనా ఈకెవైసీ చేసుకోవచ్చని చెప్పారు. ఈ-కేవైసీ చేయించుకోకపోతే గ్యాస్ మంజూరు చేయడం జరగదన్నారు.

మాజీ క్రీడాకారుడి కుటుంబానికి చేయూత



మృతుడి భార్యకు ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

మిడుతూరు: కబడ్డీ మాజీ క్రీడాకారుడు మల్లికార్జున ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న తూడిచెర్ల కబడ్డీ క్రీడాకారులురూ.30 వేలు ఆర్థిక సహాయాన్ని భార్య సావిత్రికి శనివారం అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు మల్లికార్జున, కుమార్, ఏసేపు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేద్దాం

నంద్యాల(వ్యవసాయం): ఈ నెల 10వ తేదీన నిర్వహించే నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, పట్టణ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం స్థానిక హోటల్ సూరజ్ గ్రాండ్ సమావేశ భవనంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమానికి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, ఏపీ వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరవుతారన్నారు.

విస్తారంగా మినుము సాగు

- తెగుళ్ల పోటుతో రైతన్న దిగాలు
- ఆందోళన అవసరం లేదంటున్న వ్యవసాయాధికారులు
- నివారణ చర్యలు చేపట్టాలని సూచన

ఆత్మకూరు: ఆత్మకూరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో ఈ ఏడాది రబీలో మినుము పంటను గతేడాది కంటే రైతులు అధికంగా సాగు చేశారు. ఖరీఫ్‌లో సాగుచేసిన మొక్కజొన్న, వరి పైర్ల కోతల అనంతరం రబీలో ఈ పంటను వేశారు. అయితే ఊహించని విధంగా పైర్లకు తెగుళ్ల బెడద అధికమయ్యింది. దీంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

29వేల ఎకరాల్లో సాగు..

రబీ సీజన్‌లో ఆత్మకూరు మండలంలో 10 వేలు, వెలుగోడు మండలంలో 3 వేలు, కొత్తపల్లి 7 వేలు, పాములపాడు 9 వేల ఎకరాల్లో మినుము సాగు చేశారు. అయితే పంటలు వేసిన 15 రోజుల నుంచే పైరుకు తెగుళ్లు ఆశించాయి. దీంతో ప్రభావం దిగుబడులపై పడే ప్రమాదం ఉంది. సాధారణంగా మినుము పంట ఎకరాకు 12 నుంచి 14 క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుందని భావిస్తున్న అన్నదాతలు



ఆత్మకూరు సమీపంలో సాగు చేసిన మినుము

తెగుళ్ల వలన తీవ్రంగా నష్టపోతామేమోని దిగాలు చెందుతున్నారు.

మినుమును ఆశించిన తెగుళ్లు

రైతన్నలు సాగు చేసిన మినుము పంటకు



మినుము పంటలో లద్దె పురుగు



తెగులు ఆశించిన మినుము మొక్క

దోమపోటు, పసుపుపచ్చ పురుగు, పల్లాకు తెగులు, పూత పురుగు, బూడిద తెగులు, ఆకుమచ్చ, లద్దె పురుగు, పచ్చపురుగు, ఎండుతెగుళ్లు వ్యాపిస్తున్నాయి. వీటి నివారణ కోసం అత్యధికంగా పురుగుమందులు పిచికారీ చేస్తున్నారు. అయితే ఆందోళ చెందాల్సి అవసరంలేదని, నివారణ చర్యలతో తెగుళ్లను అదుపు చేయవచ్చని వ్యవసాయాధికారుల చెబుతున్నారు. ఈ మేరకు రైతులకు సలహాలు, సూచనలు అందజేస్తున్నారు.

15 రోజులకే పురుగు వ్యాపిస్తోంది



నేను నాలుగు ఎకరాల్లో మినుము పంట సాగు చేశా. పంట సాగు వేసిన 15 రోజులకే తెగుళ్లు వ్యాపిస్తున్నాయి. లద్దెపురుగు, ఆకుమచ్చ తెగుళ్లతో పాటూ వివిధ రకాల తెగుళ్లు అధికమయ్యాయి. ఫలితంగా అధికంగా నష్టపోతామనే భయం ఉంది. వ్యవసాయాధికారులు పంట పొలాలను సందర్శించి సలహాలు,సూచనలు ఇవ్వాలి.

– బూశన్న, ఆత్మకూరు

రైతన్నలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

డివిజన్ పరిధిలో సాగు చేసిన మినుము పంటకు ఆశిస్తున్న వివిధ రకాల తెగుళ్లపై రైతులు ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదు. రైతులు విత్తువేసిన 15, 20 రోజుల నుంచే క్రిమిసంహారక మందులు ఉపయోగిస్తే మినుము పంటను కాపాడుకోవచ్చు. వాస్తవానికి మినుము పంటలో పల్లాకు తెగులు ఉధృతంగా ఉంటుంది. అయితే రైతులు విత్తువేసే ముందే ఈ తెగుళ్లు ఆశించకుండా టీబీజీ 104 , పీయూ 31, వీబీఎన్ 81, టీబీటీ 129 రకాలను ఉపయోగించాలి. పొలాల్లో పురుగుల నివారణకు లింగాకర్షక బుట్టను ఎకరానికి 5, 6 ఉంచాలి, జిగురు అట్టలు 8, 10 ఉపయోగించాలి. లద్దె పురుగు నివారణకు 10 కేజీల పాలిష్ తౌడు, రెండు కిలోల బెల్లం, 400 ఎంఎల్ మోనోక్రోటోఫాజ్ కలిపి సాయంత్రం వేళ పొలాల్లో చల్లాలి. పూత పురుగు మినుము పంటలో అధికంగా ఉంటుంది. ఆకులు, కాయలు నడుమ గూడు కట్టుకుని ఉంటుంది. ఎక్కువ నష్టాన్ని కలిగిస్తుంది. ఇందువలన నొవాల్యూరన్ ఎకరాకు 400 మిల్లీలీటర్ల, వేపనూనె 500 ఎంఎల్ లేదా థయోడీకార్బ్‌లు పిచికారీ చేయాలని, బూడిద తెగులు ఎక్కువగా వాతావరణ పరిస్థితి వలన, మబ్బులు ఎక్కువగా ఉంటే వ్యాప్తి చెందుతుంది. నివారణకు సల్ఫర్ 600, రెండవ దశలో మైక్రో బ్యుటానియల్ పిచికారీ చేయాలి. పచ్చ పురుగు నివారణకు కొరాజిన్ లేదా బెంజేయోట్ ఉపయోగించాలి. రైతులు అప్రమత్తంగా ఉండి తెగుళ్ల నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది.



– విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఓ, ఆత్మకూరు

శ్రీశైలంలో అంతర్గత బదిలీలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో పలువురు అధికారులు, ఉద్యోగులను అంతర్గత బదిలీ చేస్తూ దేవస్థానం కార్యనిర్వాహణాధికారి డి.పెద్దిరాజు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం పలువురు ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేసినట్లు ఈఓ తెలిపారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్‌కు యథావిధిగా ఉన్న విధులను కేటాయిస్తూ దేవస్థానం వైద్యశాల పర్యవేక్షణ నుంచి తప్పించారు. అలాగే నూతనంగా సహాయ కార్యనిర్వాహణాధికారిగా పదోన్నది పొందిన మల్లికార్జున రెడ్డికి శానిటేషన్ విభాగాన్ని కేటాయిస్తూ వసతి విభాగం, క్యూకాంప్లెక్స్ పర్యవేక్షణ, ప్రొటోకాల్ విధులను కేటాయించారు. ఆలయ ఏఈఓగా ఉన్న మోహన్‌కు యథావిధిగా విధులు నిర్వహించాలని సూచించారు. ఏఈఓ ఎం. ఫణీధరప్రసాద్‌కు రెవెన్యూ, లీగల్, డొనేషన్ కౌంటర్, అన్నప్రసాద విభాగ పర్యవేక్షణ అప్పగించారు. పర్యవేక్షకులు అయ్యన్నకు వసతి విభాగం, టోల్‌గేట్, దేవస్థాన వైద్యశాల, గ్యాస్ గోడౌన్ కేటాయించారు. అలాగే రవి కుమార్‌కు ప్రస్తుతం ఉన్న విధులతో పాటు అదనంగా ప్రొటోకాల్ విధులు కేటాయించారు. వీరితోపాటు సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్ పలువురు రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌ఉద్యోగులను మొత్తం 32 మంది ఉద్యోగులను ఈఓ అంతర్గత బదిలీ చేశారు. బదిలీ అయిన ఉద్యోగులు తక్షణమే వారికి కేటాయించిన విధుల్లో చేరాలని ఆ ఉత్తర్వుల్లో ఈఓ పేర్కొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం



నందికొట్కూరులో కేసులను పరిశీలిస్తున్న కర్నూలు ఇన్‌చార్జ్ సీనియర్ సివిల్ జడ్జి దివాకర్



కేసులు విచారిస్తున్న సీనియర్ సివిల్‌జడ్జి వెంకటేశ్వరరావు

నందికొట్కూరు: నేషనల్ మెగా లోక్‌అదాలత్‌లో రాజీ మార్గంలో 254 కేసులు పరిష్కారం చేసినట్లు కర్నూలు ఆడిషనల్ సీనియర్ సివిల్ ఇన్‌చార్జ్ జడ్జి దివాకర్, జూనియర్ సివిల్ జడ్జి వందన తెలిపారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో నేషనల్ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ అందరి సహకారంతో 254 కేసులు పరిష్కారం చేయడం జరిగిందన్నారు. అప్పుల కేసులు, ఆస్తి తగాదాలు, చెక్‌బౌన్స్, క్రిమినల్ కేసులు రాజీ చేసినట్లు వెల్లడించారు. అప్పులకు సంబంధించి రూ.15,20,392 రాజీ మార్గంలో బాధితులకు ఇప్పించినట్లు చెప్పారు.

ఆత్మకూరు: పట్టణంలోని కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో పలు కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి తేజసాయి తెలిపారు. వారు మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో 93 కేసులు పరిష్కారమైనట్లు వెల్లడించారు. ఇందులో క్రిమినల్ కేసులు 57, సివిల్ కేసులు 6 తో పాటు చెక్‌బౌన్స్ కేసులు 2, మెయింటెన్స్ కేసులు 2, డైవర్స్ 1, ఎక్సైజ్ కేసులు 23, యూనియన్‌బ్యాంక్ ఆత్మకూరు వారి కేసులు 2 పరిష్కారం అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీధర్, మాణిక్యరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

వెలుగోడు: ప్రకతి వ్యవసాయం లాభదాయమని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల అధికారి హేమలత తెలిపారు.వికసిత్ భారత సంకల్ప యాత్రలో భాగంగా శనివారం గుంతకందాల గ్రామంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. ప్రకతి వ్యవసాయ విభాగం నుంచి ఎస్ఆర్‌పీ నరేంద్ర గౌడ్ గ్రామంలో చేపట్టిన ప్రకతి వ్యవసాయ కార్యక్రమాలను అధికారులకు, ప్రజలకు వివరించారు. ఏటీఎం (కూరగాయల తోట మోడల్), ఏ గ్రేడ్ మోడల్ గురించి ప్రజలను చైతన్యవంతం చేశారు. వర్షాధార పొలాల్లో ప్రకతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండించే విధానాలు తెలియజేశారు. వికసిత్ భారత సంకల్ప యాత్ర సిబ్బంది, జిల్లా వనరుల అధికారి హేమలత, గ్రామ రైతులు కలిసి ప్రకతి వ్యవసాయ పద్ధతిలో పంటలు వేసిన



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఏవో

పొలాలను సందర్శించారు. ఐదేళ్లుగా రైతు సుబ్బారాయుడు సాగు చేస్తున్న క్యారెట్, బీట్‌రూట్, ముల్లంగి, ఉల్లిగడ్డ, గోంగూర, చుక్క కూర, పాల కూర, వంకాయ, టమోటా, మిరప, కాకర, సొర తదతర పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ మండల ఎంటీ మహబూబ్ బాషా, నజీర్, చక్రి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం





చెరువు కట్ట నుంచి కలశాలను తీసుకొస్తున్న అయ్యప్ప మాలధారులు, ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గుడిపాటిగడ్డలో వెలసిన అయ్యప్పస్వామి దేవస్థానంలో 44వ మండలి విళక్కి పూజా మహోత్సవాలు గ్రామోత్సవంతో శనివారం ముగిశాయి. ఉదయాన్నే కన్య స్వాములతో సింగారి మేళ వాయిద్యాలతో ఆలయం నుంచి పురవీధుల గుండా స్థానిక చెరువు కట్ట నుంచి కలశాల్లో జలాన్ని తీసుకొచ్చారు. అనంతరం అయ్యప్పస్వామి ఉత్సవమూర్తికి విశేష తిరుమంజనం, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి పూలంగి సేవ జరిపించారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేసి అన్నదానం చేశారు. సాయంత్రం పాలకొమ్ముతో అయ్యప్ప మాలధారులతో కలిసి ఉత్సవమూర్తిని పురవీధుల్లోడా కేరళ సింగారి మేళం, పేటతుల్లితో ఊరేగించారు. మహిళలు దీపాలతో ముందు నడవగా గ్రామోత్సవం కనులపండువగా సాగింది. ఆలయం నుంచి గాంధీచౌక్, కల్పనా సెంటర్, బైర్మల్‌వీధి,



దీపాలతో ముందుకు సాగుతున్న మహిళలు

ఆర్టీసీ బస్టాండ్, మెయిన్ బజార్ నుంచి ఆలయానికి చేరుకుంది. అనంతరం పడిపూజ నిర్వహించి ఊంజల సేవ, మంగళ హారతులు, హరివరాసనంతో వేడుకలను ముగించారు. కార్యక్రమంలో కల్లూరి రామలింగారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, విజయ్‌కుమార్, గోపాలకృష్ణమూర్తి, కండే శ్యాంసుందర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చెస్ పోటీలు ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ చెస్ సంఘం ఆధ్వర్యంలో శనివారం నంద్యాల జిల్లా సంఘం పర్యవేక్షణలో పట్టణంలోని హనీఫ్‌నగర్‌లోనున్న రోటరీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో జిల్లా స్థాయి చెస్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ అధ్యక్షతన జరిగాయి. ప్రిన్సిపాల్ సుబ్బయ్య, రాష్ట్ర చెస్ సంఘం జాయింట్ సెక్రటరీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ చెస్ పోటీల వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులు విజయవాడ, తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు

ఆత్మకూరు: శ్రీశైల మహాక్షేత్రానికి కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో భక్తులరద్దీని దృష్టిలో ఉంచుకుని ఆది, సోమవారాల్లో ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ సీఐ కోటయ్య శనివారం తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. ఆత్మకూరు డిపో నుంచే కాకుండా కర్నూలు, ఆదోని డిపోల నుంచి కూడా బస్సులు ఉంటాయని.. భక్తులు అవకావం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



నందికొట్కూరు: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం సాయంత్రం నుంచి తిరుగుతునట్లు చూశామని ఆర్టీసీ ఉద్యోగులు తెలిపినట్లు ఎస్ఐ హుసేన్‌బాషా తెలిపారు. శనివారం ఉదయం మృతి చెందినట్లు ఉద్యోగులు గుర్తించి సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు మృత దేహాన్ని తరలించారు. మృతుని వయస్సు సుమారు 65లోపు ఉంటుందని, గుర్తించిన కుటుంబ సభ్యులు కానీ, బంధువులు కానీ వెంటనే 91211 01187 పోలీసు స్టేషన్ సెల్ నంబరుకు ఫోన్ చేయాలని ఎస్ఐ కోరారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

శిరివెళ్ల: కోటపాడు ఏస్సీ కాలనీలో శనివారం గోస్పాడు మండలం యాళ్లూరుకు చెందిన కొటికే బాలమద్దిలేటి (50) మృత దేహం పోలీసులకు లభ్యమయింది. మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేయడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. కాలనీలోని ఓ వరి గడ్డి వామి వద్ద గడ్డిలో కప్పిన మృతదేహం వెలుగు చూసింది. గ్రామస్తుల సమాచారం మేరకు ఎస్ఐ సురేష్ సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేశారు. కాగా ఈ ఘటనలో కాలనీకి చెందిన ఓ మహిళను పోలీస్‌లు అదుపులోకి విచారణ చేస్తున్నారు. మృతుడి కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవని అయితే మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని, అందులో వాస్తవాలు వెల్లడవుతాయని చెప్పారు.

మారెమ్మ ఆలయంలో చోరీ

దొర్నిపాడు: మండలంలోని గుండుపాపల గ్రామంలో శుక్రవారం రాత్రి మారెమ్మ ఆలయంలో చోరీ జరిగిందని ఎస్ఐ తిరుపాల్ శనివారం తెలిపారు. గ్రామ శివారులోని ఆలయంలోని రూ.50వేల విలువజేసే వెండి కిరీటం, హుండీలోని రూ.5వేల వరకు నగదును గుర్తుతెలియని దొంగలు దోచుకెళ్లినట్లు చెప్పారు. పూజారి వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం



శ్రీపతిరావుపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల సంక్షేమమే లక్ష్యంగా పథకాలను అందజేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని శ్రీపతిరావుపేట గ్రామంలో శనివారం సర్పంచ్ వాణి, మండల ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి, ఇందిరేశ్వరం సర్పంచ్ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్లారెడ్డి, రమేష్, రవినాయక్, శేఖర్, రాజు, వీరాంజనేయులు, శంకరయ్య తదితరులతో కలిసి పల్లెనిద్రలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామానికి రూ.23 కోట్లకు పైగా నగదు బదిలీ ద్వారా లబ్ధిదారులకు అందాయని తెలిపారు. గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు నిర్మించారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వలన అభివృద్ధి జరుగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్‌బాలస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవినాయక్, శివరాం, అంబయ్య, రాజశేఖర్, రమేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన మహానంది



స్వామికి పూజలు నిర్వహించేందుకు వస్తున్న కాశీ యాత్ర కమిటీ బృందం



ఇన్‌కం టాక్స్ అడిషనల్ కమిషనర్ మహీధర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో కార్తీకమాసం శనివారం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది భక్తులు తరలి వచ్చారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ నెలకొంది. సాధారణ, ప్రత్యేక, శీఘ్ర, అతి శీఘ్ర దర్శనం క్యూలైన్ల ద్వారా భక్తులు గంటల తరబడి వేచి ఉండి శ్రీ కామేశ్వరి దేవి, మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఈఓ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆర్జిత సేవా టికెట్లు ప్రసాదం విక్రయం, ఇతర విభాగాల ద్వారా ఆలయానికి ఒకేరోజు సుమారు రూ.6 లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు సమాచారం.

స్వామికి దక్షిణావృత శంఖాభిషేక పూజలు

తమిళనాడుకు చెందిన ధర్మశాస్త్ర కాశీయాత్ర కమిటీ వారు 121 మందితో ప్రముఖ ఆగమ పండితులు ఆరూరు శివంగారి ఆధ్వర్యంలో శనివారం అష్టోత్తర శత దక్షిణావృత శంఖాభిషేక పూజలు నిర్వహించారు. వారు శ్రీ మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం శాస్త్రోక్తంగా చేపట్టారు. ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని, తదితరులు పూజలు పాల్గొన్నారు. పలు ప్రాంతాల భక్తులు శ్రీ మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని శంఖాభిషేక పూజలు తిలకించారు.

మహానందీశ్వర స్వామి సన్నిధిలో..

మహానంది క్షేత్రంలో ఇన్‌కమ్ ట్యాక్స్ అడిషనల్ కమిషనర్ వీసీ మహీధర్, కుటుంబ సభ్యులు శనివారం పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈఓ కాపు చంద్ర శేఖర్ రెడ్డి స్వాగతం పలికారు. వారు స్వామి అమ్మవార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. వారి వెంట నంద్యాల అసిస్టెంట్ కమిషనర్ శ్రీధర్ ఉన్నారు. అనంతరం వారు అన్నదాన పథకానికి రూ.5 వేలు విరాళం చెల్లించారు. అలాగే లోకాయుక్త డిప్యూటీ రిజిస్ట్రార్ పోలయ్య పూజలు చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మహానంది: బండి ఆత్మకూరు మండలం జీసీ పాలెం గ్రామ సమీపంలోని చెరువు వద్ద పేకాట స్థావరంపై శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. బండిఆత్మకూరు ఎస్ఐ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు 15 మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నారు. 11 మందిని అరెస్టు చేసి రూ.1,55,660 నగదు, 10 మోటర్‌సైకిళ్లు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నలుగురు పరారీలో ఉన్నట్లు చెప్పారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు



ఉద్యోగులకు చెక్కు అందజేస్తున్న ఆర్టీసీ డీఎం మహేంద్రుడు

ఆత్మకూరు: అధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లు, అధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లకు శనివారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో డిపో మేనేజర్ మహేంద్రుడు నగదును ప్రోత్సాహక బహుమతులు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ నవంబర్ నెలలో ఆత్మకూరు ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్లు ప్రతాప్, లక్ష్మి, రామలింగారెడ్డి, నాయక్, ముర్తుజాబీ, వెంకటస్వామి, మహేశ్వరి, నాయక్, శ్రీనివాసులు అధిక ఆదాయం తెచ్చారన్నారు. డ్రైవర్లు శివారెడ్డి, వలి, నారాయణ, పీఆర్సీ రెడ్డి, సీసీఎం రెడ్డి, ఎంఎస్ నాయక్ అధిక డీజల్ పొదుపు చేశారని చెప్పారు. కార్యక్రమంలో సీఐ కోటయ్యనాయక్, తదితరులు పాల్గొన్నారు.